ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★ మంగళవారం 30 జూలై 2024

అండర్‌మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి 8లో..

రైల్వే ఫ్లైఓవర్ ప్రారంభించాలని బీఆర్ఎస్ ఆందోళన 8లో..

పథకాలకు దూరం



- ఏడు మాసాలైనా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయని ప్రభుత్వం
- ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నా అందని వైనం
- అన్ని పథకాలకు రేషన్ కార్డుతోనే లింకు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలన్నింటికీ రేషన్ కార్డును ప్రామాణికం చేసింది. దీంతో కార్డులు లేని వారు ఆ పథకాలను అందుకోలేకపోతున్నారు. ఏడు మాసాలుగా కోసం పేద, మధ్య తరగతి ప్రజలు ఎప్పుడు రేషన్ కార్డులు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో గత ప్రభుత్వ హయాంలో 2022లో ఒకసారి మాత్రమే కొత్త రేషన్ కార్డులను జారీ చేశారే తప్ప, ఆ తర్వాత కార్డులను మంజూరు చేయలేదు. వాస్తవానికి కొత్తగా రేషన్ కార్డులను మంజూరుచేస్తే పెద్దగా ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకపోయినా, ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదని ప్రశ్నిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, చేర్పులు, మార్పులకు అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఏడు మాసాలు గడుస్తున్నా కూడా ఇప్పుడు, అప్పుడు అంటూ ఊరిస్తూ వస్తూనే ఉంది తప్ప కార్డులను మాత్రం మంజూరు చేయడం లేదు. పైగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను కూడా రేషన్ కార్డులతోనే ముడిపెట్టారు. తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలతో పాటు అనేక పథకాలను అమలుచేస్తామని ప్రకటించింది. ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత, యువ వికాసం వంటి పథకాలను అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో అమలుచేస్తామని ప్రకటించారు. అనుకున్నట్లుగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మొదట డిసెంబరు 9వ తేదీ నుంచి ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, చేయూత పథకంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు ఉచితంగా ఆరోగ్యాన్ని అందించేందుకు ప్రారంభించారు.

● కార్డుతోనే లింకు..

మిగిలిన గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు ప్రజల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఒకే దరఖాస్తు ద్వారా యువ వికాసం పథకం మినహా మిగతా పథకాలను అమలు చేసేందుకు డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలను నిర్వహించి ప్రజాపాలన దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించారు. ఆ దరఖాస్తులో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు 2,500 రూపాయలు ఇవ్వడం, రూ. 500కే వంట గ్యాస్ ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు ఇళ్ల మంజూరు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, చేయూత కింద కొత్తగా పింఛన్ మంజూరు కోసం ప్రజాపాలన దరఖాస్తు ఫారాన్ని రూపొందించారు. వాటన్నింటినీ భర్తీ చేసి అధికారులకు ప్రజలు అందజేశారు. వీటితో పాటు రేషన్ కార్డులు లేనటువంటి వాళ్లు తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటన్నింటినీ కంప్యూటరైజ్డ్ చేశారు. మార్చి 1 నుంచి రూ.500 కే వంట గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నారు. అలాగే 2 లక్షల వరకు రుణ మాఫీ పథకాన్ని అమల్లోకి తీసుక వచ్చారు. ఈ పథకాలన్నింటికీ రేషన్ కార్డులతో లింకు పెట్టారు. రేషన్ కార్డు లేకుండా ప్రజాపాలన కింద దరఖాస్తు చేసుకున్న వారెవ్వరికీ కూడా గ్యారంటీ పథకాలు అందడం లేదు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త రేషన్ కార్డులను జారీ చేసి చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసితులకు ఊరట..

- ఆర్బిట్రేటర్ ట్రిబ్యునల్‌తో ఎకరాకు రూ.18లక్షలకు పెంపు - వడ్డీతో కలుపుకుంటే ఎకరాకు రూ.20లక్షలకు పైగా చెల్లింపులు..

- పరిహారం పెంపు కోసం పలుమార్లు బాధితుల విజ్ఞప్తులు - కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిర్వాసితులకు న్యాయం

మంథని, జూలై 29: నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో సర్వస్వం కోల్పో తున్న డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి మండలాలకు చెందిన 1417మంది బాధితులకు పరిహారం చెల్లింపుల విషయంలో ఊరట లభిం చింది. మూడు మండలాలు, 16 గ్రామాల్లోని 500ఎకరాల భూమి, ఇళ్లను బాధితులు కోల్పోతున్నారు. ఈ రహదారి నిర్మాణంలో భూములు కోల్పో తున్న వారికి ఎకరాకు రూ. 6లక్షల వరకు నిర్ణయించి అవార్డు పాస్ చేశా రు. దీని ప్రకారం కొంతమంది రైతులకు చెల్లింపుల ప్రక్రియ సైతం పూర్తి చేశారు. బహిరంగమార్కెట్ విలువతో పోలిస్తే తమ భూములకు ప్రభు త్వం చెల్లించే పరిహారం తక్కువగా ఉందంటూ బాధితులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కలెక్టర్ కోయ శ్రీహర్షను సైతం రైతులు కలిసి తమ సమస్యను విన్నవించారు. రైతుల సమస్యలపై స్పందించిన కలెక్టర్ రైతులకు పరిహారం పెంపుపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గతంలో ఇక్కడి భూముల మార్కెట్ ధర ఎకరాకు రూ.2లక్షల వరకు ఉండగా ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఈ భూముల మార్కెట్ విలువను రూ.6లక్షలకు పెంచడంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద భూములను కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.18లక్షల వరకు నష్టపరిహారం అందేలా చేశారు. దీంతో పాటు అవార్డు పాస్ అయిన తేదీ నుంచి రూ.18లక్షలకు వడ్డీతో కలిపి పరిహారం చెల్లిస్తుండగా ఒక్కో రైతుకు ఎకరానికి రూ.20లక్షల పైనే పరిహారం అందే అవకాశం ఉంది.

జిల్లాలో తొలిగిపోతున్న అడ్డంకులు..

జిల్లాలో తొలి నేషనల్ హైవే నిర్మాణానికి ఉన్న అడ్డంకులను అధికారులు అధిగమనిస్తున్నారు. ఈ 4 లైన్ల జాతీయ రహదారికి 2021 ఫిబ్రవరి 3న కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రీన్‌ఫీల్డ్ హైవే తరహాలో పట్టణాలు, జనవాసాలకు దూరంగా మైదాన ప్రాంతాల మీదుగా సాగే జాతీయ రహదారి చేపడుతున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గ్రీన్స్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల నిర్మాణానికి సంబంధించి రూ.14,666 కోట్ల నిధుల ప్రతిపాదన.. 405 కిలోమీటర్ల ప్రాజెక్టు పొడవు.. 199.7358 హెక్టార్ల(సుమారు ఐదు వందల ఎకరాలు) ప్రతిపాదన భూమి అంచనా వేశారు. 2027 ఈ రహదారిని పూర్తిచేయాలని కాల పరిమితి పెట్టారు. తొలిప్యాకేజ్ నిర్మాణం మంచిర్యాల నుంచి వరంగల్ వరకు.. జిల్లాలోని మంథని-రామగిరి-ముత్తారం మండలాల మీదుగా నేషనల్ హైవే నిర్మాణం.. జిల్లాలో 16గ్రామాల్లో 40 కిలోమీటర్ల రహదారి, రూ. 2,607 కోట్లు కేటాయించారు.



పుట్టపాకలో గ్రీన్ ఫీల్డ్ హైవే కింద పోతున్న భూములు

నార్వ నుంచి పుట్టపాక వరకు..

ప్యాకేజీ-7 కింద చేపట్టే ఎక్స్‌ప్రెస్ రోడ్డును విభజించిన 3 ప్యాకేజీల్లో భాగంగా మంచిర్యాల సమీపంలోని నార్వ ప్రాంతం నుంచి మంథని మండలం పుట్టపాక వరకు 31.466 కిలోమీటర్లు మొదటి విడతలో చేపట్టనున్నారు.

16 గ్రామాల మీదుగా..

నాలుగు లైన్ల జాతీయ రహదారి మంథని మండలం ఉప్పట్ల గోదావరి సమీపం నుంచి పోతారం, విలోచవరం, నాగారం, కన్నాల, పందులపల్లి, పుట్టపాక, రామగిరి మండలంలోని ఆదివారంపేట, బేగంపేట, నవాబ్‌పేట, ముత్తారం మండలంలోని లక్కారం, కేశనపల్లి, ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడ్ మీదుగా భూపాలపల్లి జిల్లాలో ప్రవేశిస్తుంది. మూడు మండలాల పరిధిలోని 16 గ్రామాల మీదుగా 40 కిలోమీటర్ల పొడవు ఉంటుందని అంచనా.

బేగంపేట, పుట్టపాక వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణం..

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మంథని మండలం పుట్టపాక సమీపంలో రింగ్ రోడ్డు, ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. అలాగే రామగిరి మండలం బేగంపట వద్ద ఫ్లైఓవర్ ప్రతిపాదిందించారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా మంచిర్యాల, పెద్దపల్లితోపాటు కరీంనగర్, జయశంకర్- భూపాలపల్లి జిల్లాల ప్రజలకు నేషనల్ హైవే రహదారి అందు బాటులోకి రానుంది.

భూముల ధరలకు రెక్కలు..

జిల్లాలోని మూడు మండలాల పరిధిలో జాతీయ రహదారి నిర్మాణానికి అడుగులు దగ్గర పడుతుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు దూకుడు పెంచారు. సమీపంలో వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించే పనిలో ఉన్నారు. సాధారణంగా ఎకరాకు రూ.25 నుంచి రూ.40లక్షల వరకు పలుకుతుండగా వ్యాపారులు ఏకంగా రూ.కోటి పైగా పెంచారు. రైతులు సైతం తమ భూములకు డిమాండ్ పెరుగుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్బిట్రేటర్ ట్రిబ్యునల్ ద్వారా కొత్త పరిహారం..

పరిహారం చెల్లింపుల్లో తమకు అన్యాయం జరిగిందంటూ రైతులు కలెక్టర్‌ను ఆశ్రయించగా వారికి న్యాయం జరిగేలా ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా భూములకు మార్కెట్ విలువ పెంచడంతో పరిహారం సైతం పెరిగింది. దీంతో గతంలో ఎకరానికి రూ. 6లక్షల పరిహారం అవార్డు పాస్ చేసిన రైతులకు ప్రస్తుతం రూ. 18లక్షల వరకు దొరకనుంది. అయితే మంథని డివిజన్ పరిధిలోని మూడు మండలాలకు చెందిన 97మంది రైతులకు పరిహారం కింద రూ.2కోట్ల 72లక్షలు చెల్లింపు చేశారు. మిగతా రైతులు అవార్డు పాస్ అయినప్పటికీ తీసుకోకుండా ఉన్నారు. నిర్వాసితులుగా మారిన రైతులంద రు గతంలో అవార్డు పాసైన మేరకు వచ్చిన పరిహారం తీసుకొని ఆర్బిట్రే టర్ ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేసుకుంటే ప్రస్తుతం పెరిగిన పరిహారం అందనుంది.

రైతులంతా పరిహారం తీసుకోవాలి..

- మంథని ఆర్డీవో హనుమానాయక్..

నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ కింద భూములు కోల్పోతున్న రైతులంతా తమకు మంజూరైన పరిహారాన్ని వెంటనే తీసుకోవాలి. పరిహారం తీసుకున్న రైతులకు పరిహారం పెంపు కోసం కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటే విచారించి పరిహారం పెంపు కోసం చర్యలు తీసుకొని చెల్లింపులు జరిగేలా చూస్తారు. దీని ద్వారా రైతులకు ఎకరాకు రూ.20లక్షలకు పైగా పరిహారం అందే అవకాశముంది. రైతులు ఆలస్యం చేయకుండా వెంటనే పరిహారం తీసుకోవడానికి ముందుకు రావాలి.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్



శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెకును సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించారు. పైనుంచి వస్తున్న వరద నీటిని, ప్రాజెక్టు నీటి మట్టాన్ని, హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నంది పంప్‌హౌస్‌కు వెళుతున్న నీటిని పరిశీలించారు. ఈసందర్భంగా సంబంధిత నీటి పారుదల శాఖాధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటిని, కడెం ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటిని అంచనా వేసుకుంటూ చర్యలు చేపట్టాలన్నారు. 24గంటల పాటు ప్రాజెక్టు వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, షిఫ్టుల వారీగా విధులు నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు నీటి మట్టం 17.813 టీఎంసీలకు చేరిందని, పై నుంచి 16,081 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నదని, మిడ్ మానేరు నంది పంప్‌హౌస్ ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నామని తెలిపారు.

నేడు రైతు రుణమాఫీ రెండవ విడత నిధుల విడుదల

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీ రెండవ విడత నిధులను ప్రభుత్వం ఈనెల 30న ఉదయం 11 గంటల 45 నిమిషాలకు విడుదల చేస్తుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజున ఉదయం 11.45గంటలలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రజాప్రతినిధుల సమక్షంలో రెండో విడత రుణమాఫీ కార్యక్రమం జరుగుతుందని, రైతులకు లక్షా 50వేల వరకు ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనున్నదని తెలిపారు. రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, సహకార శాఖ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొంటారని ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

రెండో విడత రుణ మాఫీ రూ.122.43కోట్లు

పెద్దపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీలో భాగంగా రెండవ విడతలో జిల్లాలో 13,238 మంది రైతులకు 122కోట్ల 43లక్షల 26వేల652 రూపాయలు రైతుల ఖాతాల్లో ఈ నెల 30వ తేదీ నుంచి జమ కానున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దోమ ఆదిరెడ్డి పేర్కొన్నారు. మొదటి విడతలో జిల్లాలోని 29724 మంది రైతుల ఖాతాల్లో 149 కోట్ల 42 లక్షల 22వేల 297 రూపాయలు జమ అయ్యాయని పేర్కొన్నారు. రెండు విడతల్లో కలిపి మొత్తం 42,962మంది రైతులకు 271కోట్ల 85లక్షల 48వేల 949రూపాయలు రుణమాఫీ కానున్నదని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

- బడ్జెట్‌లో దళితులకు రూ.33వేల కోట్లు కేటాయించడంపై హర్షం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, జూలై 29: ప్రభుత్వం దళితులకు రూ.33,124కోట్లు బడ్జెట్‌లో కేటాయించడాన్ని హర్షిస్తూ సోమవారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పంజా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎంపీ గడ్డం వంశీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందని, రాష్ట్ర బడ్జెట్‌లో దళితుల సంక్షేమం కోసం రూ.33,124 కోట్లు కేటాయించడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు మాదరబోయిన రవికుమార్, దీటి బాలరాజు, గట్ల రమేష్, నజీమోద్దీన్, ఫజల్‌బేగ్, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, బొమ్మక రాజేష్, దూళికట్ట సతీష్, ఎర్రం మధు, నాగభూషణం, సింహాచలం, అల్లి శంకర్, మద్దెల శ్రీనివాస్, మీసాల సతీష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలిగా కోడిపుంజుల జ్యోతి

కళ్యాణ్‌నగర్, జూలై 29: ప్రగతి శీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలుగా కోడిపుంజుల జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా రజిత, ఉపాధ్యక్షురాలిగా డీ బుచ్చమ్మ, సహాయ కార్యదర్శిగా సరోజన, కోశాధికారిగా మంగ, సభ్యులుగా కే శారద, కవిత, రూపశ్రీ, పద్మ, సత్తెమ్మ, స్వప్న, అమృత, పద్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, మహిళలపై హింసకు కారణమవుతున్న గంజాయి, డ్రగ్స్, మద్యాన్ని తక్షణమే నిషేధించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆదివాసులపై జరుగుతున్న దమనకాండను నిలిపివేయాలని, పని స్థలాల్లో లైంగిక వేధింపుల చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

- కాంగ్రెస్ చేసిందేమి లేదు : మాజీ ఎమ్మెల్యే చందర్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందర్

గోదావరిఖని, జూలై 29: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి రూ. 200 కోట్లు కేటాయించారని, ఆ అభివృద్ధి పనులు జరగడం లేదని, ఆ పనులను నిర్వహించకపోతే కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం గోదావరిఖని చౌరస్తాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు నిలిచిపోయానని, రూ.200కోట్ల నిధులు కేటాయించినా పనుల అర్థంతరంగా ఆగిపోయాయని, శాసన సభ్యుడు ముఖ్యమంత్రిని ఒప్పించి నిధులు తీసుకువచ్చి ఆ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఫైవింక్లయిన్ చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణ పనులు జరగడం లేదని, టీయూఎఫ్ఐడీసీ కింద కేటీఆర్‌ను ఒప్పించి రామగుండానికి రూ.100కోట్ల నిధులను మంజూరు చేయించడం జరిగిందని, ఈ నిధులతో 50డివిజన్లలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. ప్రతి డివిజన్‌కు రూ.కోటి ఇవ్వాలని 2023లో నిర్ణయించడం జరిగిందని, ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు నిలిచిపోయాయని, వాటిని వెంటనే ప్రస్తుత ఎమ్మెల్యే చేయించాలని కోరారు. బసంత్‌నగర్ ఫ్లైఓవర్ వంతెన ఫారెస్టు అనుమతుల జాప్యంతో నిలిచిపోయాయని, కేసీఆర్‌కు విన్నవించి ఆ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేసినప్పటికీ ఆ బ్రిడ్జిని ప్రారంభించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సింగరేణి కార్మిక కుటుంబాల కోసం ఖని జనరల్ ఆసుపత్రిలో 50పడకల ఐసీయూ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. తాను రామగుండానికి మెడికల్ కళాశాల తీసుకువచ్చి మెడికల్ హబ్‌గా మార్చానని చెప్పారు. నిలిచిపోయిన పనులన్నింటిని వెంటనే ప్రారంభించాలని, లేకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో బొడ్డు రవీందర్, మెతుకు దేవరాజ్, చెలుకలపెల్లి శ్రీనివాస్, సీహెచ్ మొగిలి, పిల్లి రమేష్, అచ్చె వేణు, బొడ్డుపల్లి శ్రీనివాస్, బాదె అంజలి, సంధ్యారెడ్డి, తిరుమల, రాధ,సట్టు శ్రీనివాస్, నిట్టూరి రాజు, శ్రావణ్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై చర్యలు తీసుకోవాలి

కళ్యాణ్‌నగర్, జూలై 29: సింగరేణి మెడికల్ కళాశాలలో మహిళా కార్మికులపై లైంగిక దాడులకు పాల్పడుతున్న కామాంధునిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దెల దినేష్, ఎంఏ గౌస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.









వ్యక్తి అదృశ్యం

జమ్మికుంట రూరల్, జూలై29: మోత్కులగూడెంకు చెందిన మనోజ్ కుమార్ నాలుగు రోజుల క్రితం అదృశ్యం అయ్యాడని భార్య లావణ్య పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోజ్‌కుమార్ ఈ నెల 26న పనికి వెళ్తున్నానని భార్యకు చెప్పాడు. బయటకు వెళ్లి తిరిగా రాలేదు. మూడు రోజులుగా ఆచూకీ లేక పోవడంతో భార్య ఫిర్యాదు చేసిందని పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.







యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం

ధర్మపురి, జూలై 29: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్య సూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు నేరెళ్ల ప్రదీప్‌కుమార్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

● ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి క్షేత్రంలో సోమవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. సెలవు దినం కావటం వల్ల లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. క్షేత్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమ ధర్మరాజు ఆలయాన్ని అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు.





ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ కూలీ ఆత్మహత్య


సత్తయ్య(ఫైల్)

కోనరావుపేట, జూలై 29: ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ కూలి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నా డు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన తాళ్లపెల్లి సత్తయ్య(40) అనే వ్యవసాయ కూలీ కూలి పనులతోపాటు భూమి కౌ లుకు తీసుకొని సాగు చేసే వాడు. వ్యవసాయంలో దిగుబడి తగ్గి నష్టం రావడంతో గతంలో రెండు సార్లు పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు యత్నించాడు. మరోసారి గొంతు కోసుకున్నాడు. మూడుసార్లు ఆత్మహత్యకు యత్నించగా చికిత్సకైన ఖర్చులతోపాటు వ్యవసాయంలో వచ్చిన నష్టంతో రూ.10 లక్షల వరకు అప్పు పేరుకుపోయింది. దీంతో ఆవేదనకు గురైన సత్తయ్య ఆదివారం సాయంత్రం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పురుగుమందు తాగానని చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే అక్కడికి చేరుకొని సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

శంకరపట్నం, జూలై 29: మండలంలోని గొల్లపల్లి శివారులో కరీంపేటకు చెందిన వ్యాపారి చేపట్టిన నిర్మాణానికి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని యువజన సమితి రాష్ట్ర కార్యదర్శి మోర గణేశ్ ఆరోపించారు. సోమవారం నిర్మాణం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంపేటకు చెందిన ఓ వ్యాపారి ఇల్లు నిర్మిస్తున్నాడని చెప్పారు. అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న వ్యాపారిపై శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ మట్టి తరలింపు వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.





భార్యను చంపి భర్త ఆత్మహత్య


లక్ష్మి, రాజేశం(ఫైల్)

సిరిసిల్ల క్రైం, జూలై 29: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఆదివారం అర్ధరాత్రి దారుణం చోటు చేసుకుంది. కుటుంబ కలహాలతో జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన దూస లక్ష్మి (50)ని ఆమె భర్త దూస రాజేశం (55) రాడ్డుతో కొట్టి చంపి అనంతరం ఉరేసు కొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం... శాంతినగర్‌కు చెందిన దూస లక్ష్మి, రాజేశం దంపతులు పవర్‌లూంలు నెలకొల్పి జీవనం సాగిస్తున్నారు.. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, కు మార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం రాజేశంకు రెండు కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ చేయించు కుంటున్నాడు. సర్జరీ చేసి కిడ్నీలు మార్పిడి చేయించాలని రాజేశం కొద్ది రోజులుగా కోరుతున్నాడు. ఈ విషయంలో భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి గొడవ తలెత్తి క్షణికావేశంలో రాజేశం భార్య లక్ష్మిని రాడ్డుతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం రాజేశం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

ఎన్టీపీసీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

జ్యోతినగర్, జూలై 29: రామగుండం ఎన్టీపీసీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఒక ఉద్యోగి సోమ వారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రామగుండం ఎన్టీపీసీలో వర్క్‌మెన్‌గా పని చేస్తున్న సదరు ఉద్యోగిని 2019లో కేరళలోని కాయంకులం ఎన్టీపీసీకి యాజమాన్యం బదిలీ చేసింది. మొదటిసారి బదిలీ అయినప్పుడు కూడా ఆత్మహత్యాయత్నం చేసుకు న్నాడు. అప్పుడు యాజమాన్యం ఉద్యోగిపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగిని డిప్యూటేషన్‌పై తిరిగి రామగుండం ఎన్టీపీసీకి పంపించారు. అతని డిప్యూటేషన్ కాలపరిమితి ముగియడంతో తిరిగి డిప్యూటేషన్‌ను కొనసాగించి రామగుండంలోనే పనిచేసేందుకు అనుమతి వ్వాలంటూ చేసిన ప్రయత్నం ఫలించ లేదు. ఈక్రమంలో సోమవారం ఎన్టీపీసీ పరిపాలనా భవ నం(ఏడీఎం బిల్డింగ్) ఆవరణలో నిద్ర మాత్రలు మింగి నట్లు తెలుస్తున్నది. అతడిని ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రికి తర లించి చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. ఎన్టీపీసీ పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

మానకొండూర్, జూలై 29: మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన గాడిచర్ల తిరుపతిపై హత్యాయత్నం చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన గాడిచర్ల సాయికుమార్, అతడి తండ్రి గాడిచర్ల రాజును సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సదన్‌కుమార్ తెలిపారు. భూతగాదాలతో ఈ నెల 19నగొడ్డలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు.

ఒకరిపై వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, జూలై 29: అబాది జమ్మికుం టకు చెందిన నికత్నిస తన భర్త జమీర్ పాషా అదనపు వరకట్నం కోసం వేధిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశా రు. జమీర్ పాషా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నా డని ఫిర్యాదు చేసిందని పట్టణ సీఐ రవి తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

వేములవాడ రూరల్, జూలై 29: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని మర్రి పల్లి గ్రామానికి చెందిన తుపాకుల పర్శరాములు (68) సోమ వారం మోటారు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు జారీ వ్యవసాయబావిలో పడిపోయాడు. తీవ్రగాయాలవడంతో మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసు లు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు

మెట్‌పల్లి రూరల్, జూలై 29: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలోని హాస్టల్స్‌లో మౌలిక వసతులు కరువయ్యాయని, శిథిల భవనాల్లో విద్యార్థులు నలుగుతున్నారని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఎదుట నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన రాజారపు గణాధిత్య అనుమానాస్పదస్థితిలో మరణించడం, అదే రూమ్‌లోని రావర్తి హర్షవర్ధన్, అడేపు గణేష్ పాము కరవడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందం బాధకరమని చెప్పారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు రాపాక సాయికుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మదవేణి సునీల్, నాయకులు మారుతీ, మహాదేవ్, జస్వంత్, అక్షయ్, పవన్, అభి, మణిదీప్, విగ్నేష్, కిరణ్, నితీష్, రాకేష్, మనిష్, నిఖిలేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వారసంత

- నిరుపయోగంగా మార్కెట్ భవనం- సమీకృత మార్కెట్‌కు మోక్షం కరువు


రాయికల్‌లో రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

రాయికల్, జూలై 29: రాయికల్ పట్టణంలో వారసంత క్రయ, విక్రయాలు రోడ్డుపైనే జరుగుతున్నాయి. స్థానిక పాత బస్టాండ్ నుంచి ఇటిక్యాల క్రాసింగ్ రోడ్డు వరకు ప్రతి శనివారం ట్రాఫిక్ జామ్‌తో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు, మాంసం విక్రయాల కోసం రూ.42 లక్షల వ్యయంతో మార్కెట్ భవనం నిర్మించినా కూరగాయల వ్యాపారులు, మాంసం విక్రయదారులు ఈ భవనాన్ని వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. కూరగాయల వ్యాపారులు, మాంసం విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- మూలుగుతున్న రూ.3 కోట్ల నిధులు

రాయికల్ బల్దియాలోని ప్రజలకు ఒకేచోట అన్ని రకాల కూరగాయలు, మాంసాన్ని విక్రయించేందుకు నాలుగేళ్ల క్రితం టీయూఎఫ్‌డీసీ నిధుల నుంచి రూ.3 కోట్లతో సమీకృత మార్కెట్‌కు నిధులు మంజూరయ్యాయి. పట్టణ శివారులోని మార్కెట్ యార్డులో 20 గుంటల స్థలాన్ని అప్పటి కలెక్టర్ రవినాయక్ స్థలాన్ని ఎంపిక చేసి టెండర్ చేపట్టారు. పట్టణానికి దూరంగా ఉంటుందని, మార్కెట్ యార్డులో సమీకృత మార్కెట్ నిర్మిస్తే రైతులకు స్థలం సరిపోదనే ఉద్దేశ్యంతో ఆందోళన నిర్వహించారు. దీంతో కాంట్రాక్టర్ పనులు చేయలేక పరారయ్యారు.

- స్థలం కోసం అన్వేషణ

రాయికల్ బల్దియాలో సమీకృత మార్కెట్ కోసం మంజూరైన రూ.3 కోట్ల నిధులు మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో తిరిగి ప్రభుత్వ ఖాతాలోకి చేరనున్నాయి. బల్దియాలో 20 గుంటల స్థలం సైతం లేకపోవడంతో సమీకృత మార్కెట్ ఏర్పాటు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పందించి రాయికల్ పట్టణానికి మంజూరైన సమీకృత మార్కెట్‌ను ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి




రూ.42 లక్షలతో మార్కెట్ భవనం..

రాయికల్ పట్టణంలో రూ.42 లక్షలతో మార్కెట్ భవనం నిర్మించాం. కూరగాయలు, మాంసం విక్రయదారులు రోడ్డుపైనే విక్రయిస్తుండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. మార్కెట్ భవనంలోనే విక్రయించేలా చూస్తాం.

- మోర హన్మాండ్లు, మున్సిపల్ చైర్మన్

ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి..

రాయికల్ పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.3 కోట్లతో మంజూరైన సమీకృత మార్కెట్ పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండేలా పాలకమండలి సభ్యులతో చర్చిస్తాం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో ఏర్పాటు చేసేలా కృషి చేస్తాం. - చిరంజీవి, మున్సిపల్ కమిషనర్



కొనసాగుతున్న ఎత్తిపోతలు

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి

- ఐదు మోటర్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు తరలింపు


గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

పెద్దపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిపై నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో మిడ్‌మానేరు రిజర్వాయర్‌కు ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం 18,655 క్యూసెక్కుల వరద నీరు రాగా, సాయంత్రం వరకు 16,081 క్యూసెక్కులకు తగ్గింది. కడెం ప్రాజెక్టు నుంచి 8,170 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 7,911 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో నిన్నటి వరకు నంది మేడారం నంది పంప్‌హౌస్ నుంచి 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసె క్కుల నీటిని తరలించిన ప్రాజెక్టు అధికారులు ఉదయం నుంచి 5 మోటార్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని గాయత్రి పంప్‌కు, అక్కడినుంచి మిడ్ మానేరు తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, సాయంత్రం 6 గంటల వరకు 17.813 టీఎంసీల నీటి మట్టానికి చేరుకున్నది. ప్రాజెక్టు ఎగువ భాగాన వర్షాలు తగ్గుముఖం పట్టాయి. వరద పెరిగితే మాత్రం మరో రెండు మోటార్లను ప్రారంభిస్తామని నీటి పారుదల అధికారులు చెబుతున్నారు.

● గాయత్రి పంప్ హౌస్ నుంచి ..

రామడుగు: మండలంలో లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. శనివారం 4 బహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు ఆదివారం వరకు కొనసాగించారు. కాగా సోమవారం నుంచి ఐదు పంపుల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. రెండు రోజుల పాటు రోజుకు 12,600 క్యూసెక్కుల నీటి విడుదల చేసిన అధికారులు సోమవారం ఐదు పంపులదావ్రా 15,750 నీటిని విడుదల చేశారు. డెలివరి పాయింట్ నుంచి గ్రావిటి కెనాల్‌లోని ఐదు పంపులు, ఒకేసారి విడుదల కావడంతో నీటి ప్రవాహం ఉప్పొంగుతూ ప్రవహిస్తోంది. గ్రావిటి కెనాల్ నుంచి నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతూ వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు చేరుతోంది. కాగా ఐదు పంపులతో నీటి విడుదల కొనసాగిస్తుండగా నిండుకుండలా వరద కాలువ ప్రవహిస్తూ ఉండడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదు పంపుల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తున్నట్లు గాయంత్రి పంప్ హౌస్ అధికారులు తెలిపారు.

కోటిలింగాల వద్ద గోదావరిలో పెరుగుతున్న వరద


కోటిలింగాల వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల వరకు చేరిన నీరు

వెల్గటూర్, జూలై 29: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరిలోకి వరద నీరు పెరుగుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి గోదావరిలోకి చేరుతున్నాయి. కడెం ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 4,311 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలో నీటి మట్టం పెరుగుతోంది. గోదావరిలోకి వరద నీరు చేరుతుండడంతో పుష్కర ఘాట్ల వరకు నీరు చేరింది. గోదావరిలో వరద నీరు చేరి నీటి మట్టం పెతుండడంతో గొర్ల కాపర్లు, మత్స్యకారులు గోదావరిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేసే భక్తులు లోతు ప్రాంతానికి వెళ్ల వద్దని తహసీల్దార్ శేఖర్, ఎస్సై ఉమా సాగర్ హెచ్చరించారు.

పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

- ప్రాజెక్టులోకి 17,310 క్యూసెక్కుల నీరు


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరదనీరు పెరుగుతోంది. సోమవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 17,310 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 33.857 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 75.709 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 644 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 28.260 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.463 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వాడారు.

జ్వరాలతో ఇద్దరి మృతి

కాల్వశ్రీరాంపూర్, ఓదెల, జూలై 29: పెద్దపల్లి జిల్లాలో జ్వరాలతో ఇద్దరు మృతిచెందారు. కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేటలో సాయి సాత్విక్(13) మృతి చెందాడు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న సాయిసాత్విక్‌కు ఆదివారం తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా ఆదివారం రాత్రి మార్గమధ్యలో మృత్యువాత పడినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే ఓదెల మండలం ఇందుర్తిలో సోమవారం గాదం ప్రతాప్(68) అనే వృద్ధుడు జ్వరంతో మృతి చెందాడు. వారం రోజుల నుంచి జ్వరంతో ప్రతాప్ మంచం పట్టాడని, వైద్యం కోసం జమ్మికుంటకు తరలించేందుకు సిద్ధమవుతుండగా ఇంట్లోనే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు.

జాఫర్ ఖాన్ పేటలో వైద్య శిబిరం


వివ జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్

కాల్వశ్రీరాంపూర్, జూలై 29: మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటలో జ్వరాలు రావడంతో సోమవారం ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంను జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు వర్షాకాలంలో ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు, చెత్త ఉండడం వలన దోమలు పెరిగిపోయి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. జ్వరం వచ్చినట్లయితే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 35మంది రక్తనమూనాలు సేకరించారు. 108మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ భావన, హెచ్ఈఓ లక్ష్మణ్, ఏఎన్ఎం కవిత పాల్గొన్నారు.

పీఎఫ్‌లో మార్పులుంటే ఈ నామినేషన్‌లో సరిచేసుకోవాలి

- పీఎఫ్, బీమా, పెన్షన్ సమస్యల పరిష్కారానికి కృషి
- రీజినల్ పీఎఫ్ కమిషనర్ తానయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్‌సీ తానయ్య

జ్యోతినగర్, జూలై 29: ఉద్యోగులు, కార్మికులకు సంబంధించి ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) వివరాలలో తేడాలుంటే, మార్పులు, చేర్పులుంటే ఇ నామినేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో సరి చేసుకోవాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్ ఎస్.తానయ్య సూచించారు. సోమవారం ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసి ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో పీఎఫ్, ఇన్సూరెన్స్, పెన్షన్‌లపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తానయ్య మాట్లాడుతూ ఉద్యోగుల దగ్గరకే ఈపీఎఫ్ఓ కార్యక్రమం ద్వారా పీఎఫ్ సంబంధ సమస్యల పరిష్కారానికి మా వాఖ కృషి చేస్తున్నదన్నారు. కార్మికుల పీఎఫ్ డేటాలో మార్పులు చేసుకోవడానికి గతంలో మ్యాన్యువల్‌గా ప్రక్రియ ఉండేదని ఇప్పుడు ఇ నామినేషన్ అనే ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎన్టీపీసీ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ స్కీంకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని, 2014 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగలకు హయ్యర్ పెన్షన్ వర్తింస్తుందన్నారు. అలాగే కార్మికులు పీఎఫ్‌కు సంబంధించి సమస్యలుంటే కరీంనగర్‌లోని రీజినల్ పీఎఫ్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ఏజెన్సీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాను ఆర్‌పీఎఫ్ కమిషనర్ తానయ్య నివృత్తి చేశారు. హయ్యర్ పెన్షన్ విషయంలో తాము పీఎఫ్ సంస్థకు చెల్లించే సొమ్మును పంపించినప్పటికీ తమకు చెక్కులు ఎందుకు వాపసు చేశారో చెప్పాలని కొంతమంది మాజీ ఎన్టీపీసీ ఉద్యోగులు రీజినల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ ఈ.కిరణ్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి(పీఎఫ్) వి.వెంకట రమణ, ఎన్టీపీసీ ఏజీఎం సిక్దర్, అధికారు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పరిష్కారం చూపాలి

317జీవో బాధితుల బదిలీ సమస్యకు


మాట్లాడుతున్న టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేశ్

జగిత్యాల అర్బన్, జూలై 29: జీవో 317 బాధితులకు డీఈవో పూల్‌లో ఉన్న పోస్టుల్లో బదిలీ చేస్తూ సమస్యకు పరిష్కారం చూపాలని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంగూరి సురేష్, గుర్రం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బదిలీ, పదోన్నతులతో పాటు 10,456 పండిత, పీఈటీ అప్‌గ్రేడేషన్ సమర్థవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్టీఎఫ్) పక్షాన కృతజ్ఞతలు తెలిపా రు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించిన రాష్ట్రప్రభుత్వం మిగిలిపోయిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు బీఈడీ కలిగిన వారికి అర్హత కల్పించాలన్నారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు 10వేల పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని, మిగిలిన పండిత పీఈటీల పదోన్నతుల సమస్యలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికీ రిలీవ్‌కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయిని విజయానందరావు. జిల్లా బాధ్యులు శేఖర్, శ్రావణ్, రమేశ్, అహ్మదుల్లా ఖాన్, భూమరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా

- పెగడపల్లి మండలంలో ఎస్సారెస్పీ కాలువలు అధ్వానం - పట్టించుకోని అధికారులు


పెగడపల్లి శివారులో ఎస్సారెస్పీ డీ77 కాలువలో పెరిగిన పచ్చి మొక్కలు

పెగడపల్లి, జులై 29: మరమ్మతులు లేక ఎస్సారెస్పీ కాలువలు ఆనవాల్లు కోల్పోతున్నాయి. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలకు నందగిరి, అయిత్‌పల్లి మినహా 21 గ్రామాలు శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉండగా కాలువ నీరు వస్తేనే పంటలు పూర్తిస్థాయిలో పండుతాయి. మండలంలోని పలు డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఏళ్ల క్రితం సిమెంట్ లైనింగ్ చేయగా అప్పటి నుంచి వాటి మరమ్మతు, పూడిక తీత పనులపై పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో దాదాపు అన్ని డిస్ట్రిబ్యూటరీ కాలువలు పిచ్చిమొక్కలతో నిండి పోవడమే కాకుండా సిమెంట్ లైనింగులు కూలిపోయి, తూముల షట్టర్లు ఊడిపోయి కాలువల ఆనవాల్లు కనిపించ కుండా పోయాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి నీరు చేరితే మొదటి పంటకు మరి కొద్ది రోజులలో నీరు వదిలే పరిస్థితు లుండగా కాలువల మరమ్మతు పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపుకు మాత్రం అధికారులు దృష్టిసారించడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువలలో పిచ్చిమొక్కలు పెరిగి ప్రధాన కాలువ నుంచి ఎన్ని నీళ్ల వదిలినా సమీప ప్రాం తాల రైతులకు మాత్రమే ప్రయోజనం కలుగుతోంది. చివరి ఆయకట్టు పంటలకు సాగు నీరు అందకపోవడంతో ఎండి పోతున్నాయి. అధికారులు కాలువల మరమ్మతులతో పాటు పిచ్చిమొక్కల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సైబర్ మోసంతో 1.84 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

మెట్‌పల్లి, జూలై 29: మెట్‌పల్లి పట్టణానికి చెందిన జోగ నవీన్ అనే యువకుడు సైబర్ మోసంతో 1.84 లక్షలు పోగొట్టుకున్నట్లు సోమవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జోగ నవీన్ క్రెడిట్ కార్డుతో ఓ సంస్థ వెబ్‌సైట్‌లో టీవీని కొనుగులు చేశాడు. టీవీ ప్రాబ్లం రావడంతో దాన్ని రిటర్న్ పంపడానికి ఆన్‌లైన్‌లో సంప్రదించగా వాళ్లు టీవీ కంపెనీ వాళ్లకు అందజేయాలని సూచించారు. దీంతో అన్‌లైన్‌లో కస్టమర్ కేర్ నంబర్ వెతికి దానికి ఫోన్ చేశారు. టీవీ కొనుగోలు చేసిన నంబర్ తెలపాలని అడిగి దానికి ఓ లింక్ పంపాడు. వారు చెప్పిన విధంగా చేశాడు. వెంటనే అకౌంట్‌లో డబ్బులు కట్ అయినట్లు మెసేజ్ రావడంతో వెంటనే బ్యాంకులోని అధికారులను సంప్రదించగా రూ. 1.84లక్షలు కట్ అయినట్లు తెలిపారు. టీవీ కంపెనీ వారిని సంప్రదించగా మాకు ఎలాంటి డబ్బులు రాలేదని తెలపడంతో మోసపోయానని గుర్తించాడు. వెంటనే అన్‌లైన్‌లో సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు జోగ నవీన్ తెలిపారు.

సింగరేణి సీఎండీని కలిసిన తుమ్మేటి సమ్మిరెడ్డి

గోదావరిఖని, జూలై 29: సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీపీసీసీ మీడియా కన్వీనర్ తుమ్మేటి సమ్మిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేసి సీఎండీగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల పిల్లలు నిరుద్యోగులుగా ఉన్నారని, వారిలోని నైపుణ్యం వెలికి తీసేందుకు కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను గోదావరిఖనిలో ఏర్పాటు చేయాలన్నారు. కాలుష్యాన్ని నిర్మూలించడానికి నిత్యం మొక్కలు నాటి పర్యావరణానికి దోహనం చేయాలని, సింగరేణి ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలకు సీఎస్ఆర్ ఫండ్ అందించాలని సీఎండీని కోరారు. సీఎండీని కలిసిన వారిలో టీపీసీసీ అధికార ప్రతినిధి సుధాకర్‌గౌడ్, విజయభాస్కర్, మధుకర్‌రెడ్డి ఉన్నారు.

పొలాల్లో వలస కూలీలు

- నాటు వేసేందుకు మహారాష్ట్ర నుంచి రాక - రైతులకు తప్పిన ఇబ్బందులు - ఎకరానికి రూ. 5వేలు చెల్లింపు


చెర్లబూత్కూర్‌లో నాటు వేస్తున్న మహారాష్ట్ర కూలీలు

కరీంనగర్ రూరల్, జూలై 29: ఉమ్మడి జిల్లాలో గత కొన్నేళ్లుగా వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో గ్రామాల్లో నాటు వేసేందుకు కూలీల కొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు రైతులు పొరుగు రాష్ట్రాల కూలీలను ఆశ్రయిస్తున్నారు. నాట్లు వేయడానికి మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల రైతులు మహారాష్ట్ర నుంచి కూలీలను రప్పించి నాట్లు వేయిస్తున్నారు. కొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు కొంత ఆలస్యంగా పడడంతో రైతులు కొంత నిరాశ చెందారు. ఇటీవల వరణుడు కరుణించడంతో వరి నాట్లు లేటవుతాయన్న నేపథ్యంలో మండలంలోని చెర్లబూత్కూర్, ఇరుకుల్ల, దుబ్బపల్లి, చామనపల్లి, నగునూర్ గ్రామాల రైతులు మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకువచ్చారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి, చంద్రాపూర్ జిల్లాల నుంచి 120మందికి పైగా వలస వచ్చారు. ఒక్కో గ్రూప్‌లో 14మంది మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మొత్తం 18మందితో వరి నాట్లు వేస్తున్నారు. పురుష కూలీలు ముందుగా వరి నారు తీసి మహిళలు నాటేసేందుకు వీలుగా పొలంలో సిద్ధంగా పెడుతున్నారు. ఉద యం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు నాట్లు వేస్తున్నారు. ఇందుకు గాను ఎకరానికి గుత్తగా ఐదు వేల రూపాయలు తీసుకుంటున్నారు. మహారాష్ట్ర నుంచి కూలీల రాకతో వరి నాట్లు త్వరగా పూర్తవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

హనుమాన్ చాలీసా భజన

కమాన్‌పూర్, జూలై 29 : మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి క్షేత్రంలోని కల్యాణ మండపంలో గురుస్వామి చింత శంకర్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన హనుమాన్ చాలీసా భక్తజన బృందం భజన చాలీసా పారాయణం నిర్వహించారు. నిత్య హనుమాన్ చాలీసా సోమవారం రోజుకు 3873రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో జైన శ్రీనివాస్, పుత్తూరి జయప్రకాష్, దొంతుల చంద్రశేఖర్, ప్రశాంత్, సంపత్‌రెడ్డి, బత్తుల అశోక్, నూనె సారయ్య, నూనె వెంకన్న, గుండా సంతోష్, బాణాల శ్రీనివాస్, వేణు తదితరులు ఉన్నారు.

నేడు రెండో విడత రుణమాఫీ : ఎంపీడీవో

కమాన్‌పూర్, జూలై 29 : రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా అర్హులైన రైతులకు లక్ష నుంచి లక్ష 50 వేల వరకు ఉన్న పంట రుణమాఫీ అవుతుందని మండల వ్యవసాయాధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈనెల 30వ తేదీన మధ్యాహ్నం 12 గంటల వరకు రెండో విడత రుణమాఫీని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

నేత్రదానం

ఓదెల, జూలై 29: మండల కేంద్రంలో సోమవారం అనారోగ్యంతో మృతిచెందిన అప్పని చంద్రయ్య నేత్రాలను కుటుంబ సభ్యులు సదాశాయ ఫౌండేషన్‌కు దానం చేశారు. ఈ మేరకు కరీంనగర్ ఎల్‌వీపీ నేత్ర ఆసుపత్రి టెక్నీషియన్ గాజుల సతీష్ నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు తరలించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి, నిర్వాహకుడు జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, బాధిత కుటుంబాన్ని అభినందించారు. కోంర్ర వేణు, క్యాతం మల్లేశం, క్యాతం వెంకటేశ్వర్లు, అల్లం సతీష్, మేర్గు సారంగం, అప్పని తిరుపతి, చెరుకు తిరుపతి పాల్గొన్నారు.

ఎంపీడీవోల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా దివ్యదర్శన్‌రావు

సుల్తానాబాద్, జూలై 29: సుల్తానాబాద్ ఎంపీడీవో నీలగిరి దివ్యదర్శన్‌రావు ఎంపీడీవోల సంఘం ఎన్నికల్లో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు తెలంగాణ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాదిక్‌పాషా, పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నకోటి వెంకటేశ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యదర్శన్‌రావును సోమవారం ఈ రెండు సంఘాల ప్రతినిధులతో పాటు పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

సుల్తానాబాద్, జూలై 29: పద్మశాలీ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని, ఐక్యతకు కృషి చేయాలని పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు యాదగిరి అన్నారు. పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు సోమవారం హైదరాబాద్‌లో జరుగునున్న నేపథ్యంలో పలువురు నాయకులు సుల్తానాబాద్ నుంచి సోమవారం హైదరాబాద్ బయలుదేరారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ వేసిన వల్లకాటి రాజకుమార్‌కు మద్దతు ప్రకటించి సన్మానించారు. సామల రాజేంద్ర ప్రసాద్, దూడం అంజనేయులు, స్వతంత్ర కుమార్, సంపత్, మనోహర్, చిరంజీవి పాల్గొన్నారు

స్థానికంగానే విద్యుత్ సమస్యల పరిష్కారం

రామగిరి, జూలై 29: గ్రామంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైనా స్థానికంగానే పరిష్కారిస్తామని బేగంపేట్ విద్యుత్ ఏఈ మహేందర్ అన్నారు. సోమవారం మండలంలోని నాగేపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో వర్షం కారణంగా విద్యుత్ అంతరాయంపై స్థానిక మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, ఎస్సీ కాలనీ ప్రజలు ఏఈ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సుల్తానాబాద్, జూలై 29:మండలంలోని కనుకుల గ్రామ గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు సురువు రాజేశం మృతిచెందగా, సోమవారం బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. దాసరి ఉషతో పాటు గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మ రాజేశం, మత్స్యకార్మిక సంఘం జిల్లా నేత గరిగంటి కుమార్ బాబు, మాజీ ఎంపీటీసీ మైలారం నారాయణ ఉన్నారు. అలాగే సుల్తానాబాద్ శాస్త్రినగర్‌కు చెందిన పోచంపల్లి శంకర్ మృతితో బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కిలలో బియ్యం అందజేశారు. సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతను కూడా పరామర్శించారు.

మొక్కలు నాటించిన అధికారులు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పెద్దపల్లి రూరల్, జూలై 29 : మండలంలోని కొత్తపల్లిలో నాటాల్సిన మొక్కలను పక్కకు పడేయడంతో దీనిపై సోమవారం వనమహోత్సవం లక్ష్యానికి తూట్లు అనే శీర్షిక ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. సోమవారం ఏపీవో రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిరూపయోగంగా ఉన్న మొక్కలను ఉపాధిహామీ సిబ్బందితో నాటించారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

సుల్తానాబాద్, జూలై 29: మండలంలోని గర్రెపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీపై వెళ్లిన సిరిశెట్టి ప్రశాంత్‌ను సన్మానించారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షురాలు వీరగోని సుజాత రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొని కార్యదర్శి సేవలను కొనియాడారు. అనంతరం ప్రజాప్రతినిదులు ఆయనను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగా వచ్చిన కార్యదర్శి లచ్చయ్య, మాజీ ఎంపీటీసీ పులి అనూష, మాజీ ఉప సర్పంచ్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం



ప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



శ్రీపాదరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐత ప్రకాష్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, జూలై 29: తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి మొదటిసారిగా పెద్దపల్లి వస్తున్న సందర్భంగా సోమవారం కమాన్‌వద్ద పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణ వేణి సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పట్టణ కాంగ్రెస్ కౌన్సిలర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు బూతగడ్డ సంపత్ తూములసుభాష్ రావు పుష్పకళ శ్రీమాన్‌కొండి సతీష్, బండారి సునీల్‌గౌడ్, దొడ్డుపల్లి జగదీష్, బొడ్డుపల్లి శ్రీనివాస్, నాంసాని శ్రీనివాస్, కొమ్ము అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జూలై 29: తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డికి సోమవారం సుల్తానాబాద్‌లో ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి వెళుతున్న ప్రకాష్‌రెడ్డిని సుల్తానాబాద్ పూసాలచౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు వేగోలం అబ్బయ్యగౌడ్, చిలుక సతీష్, బ్లాక్ అధ్యక్షుడు దామోదర్‌రావు, అమిరిశెట్టి రాజలింగం, వలస నీలయ్య, అంతటి సాగర్, లక్ష్మణ్, అభినవ్, ఆవుల శివ, రాజు, మాదూరి పృధ్వీకృష్ణ, రాజయ్య, ఎండీ అమీనొద్దిన్, మోబిన్, గాదాసు రవిందర్, మధు, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, జూలై 29: తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి మొట్ట మొదటిసారిగా గోదావరిఖనికి వచ్చిన ఐత ప్రకాష్‌రెడ్డికి కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గోదావరిఖని బస్టాండ్ వద్ద ఉన్న మాజీ స్పీకర్ దివంగత శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలిపాక సుజాత, కాంగ్రెస్ నాయకులు కాల్వలింగ స్వామి, తిప్పారపు శ్రీనివాస్, నాయిని ఓదెలు, మారెల్లి రాజిరెడ్డి, బొమ్మక రాజేష్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీలన్నీ నీటి మూటలు..

- ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసిపేట శివాజీ

కళ్యాణ్‌నగర్, జూలై 29: ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలేనని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసిపేట శివాజీ ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చేవెళ్లలో నిర్వహించిన కాంగ్రెస్ సభలో రాహుల్ గాంధీ, మల్లికార్జునఖర్గే, రేవంత్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చేయడం జరిగిందని, ఈ డిక్లరేషన్‌లో ఏది కూడా ఎస్సీలకు, ఎస్టీలకు అమలు కాలేదన్నారు. దళిత బంధు స్కీమ్‌ను రూ.10లక్షల నుంచి రూ.12లక్షల వరకు పెంచుతామని చెప్పినా ఇప్పటి వరకు ఆ స్కీమ్ గురించి ఊసెత్తడం లేదని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమంగా తీసుకున్న ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూములను తిరిగి ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు దానిపై ప్రణాళికలు లేవని, ఎస్సీ రిజరేషన్‌ను 18శాతం పెంచుతామని చెప్పినా దాని గురించి ఊసెత్తడం లేదని, ఎస్సీ రిజర్వేషన్లు దమాశ ప్రకారం పెంచాలని, పోడు భూములకు హక్కు కల్పించాలని డిమాండ్‌చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు పెద్దపల్లి రవీందర్,జక్కుల నరహరి, సుల్వ లక్ష్మీ నర్సయ్య, మహావాది రామన్న, కోడూరి రమేష్, సతీష్, మాదాసు సుధాకర్,అపర్ణ, దాసరి శ్రీనివాస్, బద్రి దేవేందర్, రాజ్‌కుమార్, నర్సయ్య, సాగర్, వెంకట్, స్వామి, రాకేష్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

కాల్వశ్రీరాంపూర్, జూలై 29: మండల కేంద్రంలో పాండవుల గుట్టపై నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం మాజీ జడ్‌పీటీసీ గోపగోని సారయ్యగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండగా ఇంతవరకు మండలంలో ఒక్కరికి ఇల్లు ఇవ్వలేకపోయింది అన్నారు. ఇల్లు లేని వారందరికీ ఇల్లు ఇవ్వడమే ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారం మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూములు పరిశీలించామన్నారు. సుమారు 240వరకు ఉన్న ఈ డబుల్ బెడ్ రూములకు విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ, కట్టిన డబుల్ బెడ్‌రూమ్‌లకు కిటికీలు, తలుపులు, తాగునీరు అందించేందుకు వాటర్‌ట్యాంకు, సీసీరోడ్లు వేయాల్సి ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గాజన వేనసదయ్య, మాజీ జడ్‌పీటీసీ లంక సదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ మునీర్, మాదాసు సతీష్, పొట్యాల మొండయ్య, బంగారు రమేష్, గోలి సుధాకర్, రానవేన క్రాంతి, కొంతం మధుకర్, తాండ్ర సురేష్ గోవర్ధన్, ప్రభాకర్, కాసర్ల లక్ష్మారెడ్డి, ఎనగంటి నవీన్, రవితేజ పాల్గొన్నారు.

ఆలయంలో భక్తులకు మొక్కల పంపిణీ

కమాన్‌పూర్, జూలై 29: మండల కేంద్రంలోని సుప్రసిద్ధ ఆదివరాహస్వామి పుణ్యక్షేత్రంలో అభయ చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఆలయానికి స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ వెల్ది కవిత అనంతరాములు మాట్లాడుతూ ఆదివరాహస్వామి వారి క్షేత్రంలో వచ్చిన భక్తులకు మొక్కులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటివద్ద తప్పనిసరిగా మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు రామానుజచారి, హర్షవర్ధన్‌చారి, మాజీ ఆలయ డైరెక్టర్లు బోజ్జ నర్సింహచారి, కొలిపాక లక్ష్మీతో పాటు వెల్ది అనిల్, రామిళ్ల సతీష్, వెంకటన్న తదితరులు ఉన్నారు.

దారిని బాగు చేయించాలి

పెద్దపల్లి రూరల్, జూలై 29 : మండలంలోని చీకురాయి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు దారి బురదమయమైందని, వెంటనే రోడ్డును బాగుచేయించాలని బిఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష అన్నారు. సోమవారం చీకురాయిలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రహదారిని నాయకులతో కలిసి పరిశీలించారు. వెంటనే అధికారులు, ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వారి వెంట పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు లైశెట్టి భిక్షపతి, ఈరబోయిన శ్రీనివాస్, జక్కుల శ్రీకాంత్, పెంచాల శ్రావణ్, తనుగుల రాజు, సదయ్య, ఈదునూరి ప్రేమ్‌కుమార్, జక్కుల నవీన్, జక్కుల భాస్కర్, జక్కుల బన్ని, బాలసాని శ్రీకాంత్ ఉన్నారు.

రైల్వే ఫ్లైఓవర్ ప్రారంభించాలని బీఆర్‌ఎస్ ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన బీఆర్‌ఎస్ నాయకులు

పాలకుర్తి, జూలై 29: బసంత్‌నగర్ బుగ్గ సమీపంలో నిర్మించిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు సోమవారం బ్రిడ్జి వద్ద బైఠాయించారు. పనులు పూర్తయినా ప్రారంభించని రైల్వే బ్రిడ్జికి అడ్డుగా ఉన్న మట్టి దిబ్బను తొలగించే కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు కౌశిక్ హరి చేపట్టారు. ఈ నేపథ్యంలో కౌశిక్ హరితోపాటు ఆయన సతీమణి, 22వ డివిజన్ కార్పొరేటర్ లతను రామగుండంలో పోలీసులు హౌజ్‌అరెస్ట్ చేశారు. రామగుండం,అంతర్గాం, బసంత్‌నగర్ పోలీసులు ఉదయం నుండే అక్కడ భారీ బందోబస్తు చేపట్టారు. కౌశిక్ హరి పిలుపు మేరకు పార్టీ శ్రేణులు, కేశోరాం కార్మికులు ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని అంతర్గాం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిని త్వరలో ప్రారంభిస్తాం

- రామకృష్ణ, హెచ్‌కేఆర్ ప్రాజెక్టు మెనేజర్

బసంత్‌నగర్ సమీపంలో నిర్మించిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభిస్తాం. బ్రిడ్జి పనులు పూర్తయినా అక్కడ పెయింటింగ్ పనులు, చెట్లు నాటే పనులతో పాటు మరికొన్ని చిన్నాచితక పనులు నిలిచిపోయాయి. త్వరలో అన్ని పనులను పూర్తిచేసి బ్రిడ్జిని ప్రారంభిస్తాం.

హౌస్ అరెస్టులతో ఆపలేరు..

అంతర్గాం, జూలై 29: హౌస్ అరెస్టులతో ప్రభుత్వం ప్రజాఆందోళనలు ఆపలేరని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి శివారు రాజీవ్ రహదారిపై రైల్వేబ్రిడ్జి వద్ద రహదారి పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రారంభోత్సవం చేయడం లేదని విమర్శించారు. ఒకేదారిలో రాకపోకలు సాగుతున్న క్రమంలో అనేకసార్లు ప్రమాదాలు చేసుకుంటున్నా నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. తాను ప్రజల సౌకర్యం కోసం ప్రజలతో కలిసి రోడ్డుకు అడ్డుగా పెట్టిన రాళ్లను తొలగించుటకు సిద్ధమవ్వగా తమను రామగుండం పోలీసులు హౌస్ అరెస్టు చేసి అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కౌశిక హరితోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులను రామగుండం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బీసీల జన గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

మంథని, జూలై 29: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో వరంగల్లో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీ ప్రకారం బీసీ కుల గణన చేసి దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్ లాల్ అన్నారు. సోమవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 52 నుంచి 60 శాతం వరకు ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతుందని రిజర్వేషన్లు పెంచిన తదుపరి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో దేశంలో బీసీలు బాగుపడితేనే దేశం బాగుపడుతుందని ఆయన అన్నారు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేకుంటే బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ కులాలకు చెందిన ప్రతి ఒక్కరూ ఐక్యతతో ఉండాలని వీటి కోసం ఉద్యమించాలని శంకర్ గౌడ్ కోరారు. రిజర్వేషన్ల పెంపు కోసం సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని బీసీలకు న్యాయం చేసే దిశగా ముందడుగు వేయాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్, ఎంపీటీసీల సంఘం మాజీ అధ్యక్షుడు పెగడ శ్రీనివాస్, బీసీ సంఘం నాయకుడు అడిచర్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సుల్తానాబాద్, జూలై 29: రాష్ట్రంలోని అన్ని కేటగిరీల హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయా లని జిల్లా సీఐటీయు ప్రధాన కార్యదర్శి కదారి సునిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ ఫర్టిలైజర్ హమాలీ కార్మికులకు సోమవారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ దుకాణ యజమానులు శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, సరిపురం రమేష్, హరిక మల్లారెడ్డి, హమాలీ కార్మికులు రమేష్, శ్రీను, రాజు, చంద్రయ్య, అంజయ్య, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

జ్యోతినగర్, జులై 29 : ఎన్టీపీసీలోని ట్రినిటి డిగ్రీ కళాశాలకు చెందిన 2006-09 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం సోమవారం స్థానిక మాతంగి కాలనీలోని ఒక ఫంక్షన్‌హాలులో జరిగింది. 16 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు తమ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ట్రినిటి డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు సురేష్, శ్రీనివాస్, భాస్కర్, తాజొద్దీన్ బాబ, పూర్వ విద్యార్థులు గట్టు శ్రీనివాస్, పులుగం స్వప్న, అరుణ, రాంమూర్తి, శ్వేత, శ్రీకాంత్, కుమార్, వెంకటేశ్, పరమేశ్వర్, రాజేశ్, లక్ష్మణ్, తిరుపతి, విజయలక్ష్మి, లావణ్య, కోమల, సరళ, స్రవంతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో మత్స్య కార్మికులను విస్మరించిన ప్రభుత్వం'

కమాన్‌పూర్, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి నిధులు కేటాయించకపోవడం సరికాదని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ తాళ్ల తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటులో మత్స్య కార్మికులు తమవంతు సహకారం అందించిన విషయం మరువరాదన్నారు. ఈ శాఖలో ముదిరాజ్, బెస్త, ఎస్సీ, ఎస్టీ మొదలైన అన్ని బలహీన వర్గాల కులాలు ఉన్నందున ప్రభుత్వంలో మత్స్యశాఖ అతి కీలకమైన, మత్స్యశాఖకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అయిన ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీ ఊసే లేదన్నారు. గత ప్రభుత్వం మత్స్యశాఖకు నిధులు కేటాయించడమే కాకుండా కార్మికుల జీవనోపాధికి అనేక ప్రజా పథకాలను, బైక్స్ పడవులు వలలు ఐస్ ఫ్యాక్టరీ కోల్డ్ స్టోరేజ్ బాక్సలు రక్షణ వలయాలు జరిగిందని గుర్తు చేశారు. అలాగే ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. 55 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు ప్రభుత్వం పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రొంపికుంట గ్రామ మత్స్యకార సొసైటీ ఉపాధ్యక్షులు రాచకొండ రవి, కోశాధికారి చొప్పరి తిరుపతి, డైరెక్టర్లు బూతగడ్డల శ్రావన్, కొండిల్ల సతీష్, తాళ్ల రాజేష్, చొప్పరి సతీష్, తాళ్ల కనకయ్యలు పాల్గొన్నారు.

రాజుకు జాతీయ స్థాయి ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజు

మంథని, జూలై 29: మంథని వాసి, ప్రముఖ కాంగ్రెస్ నేత గుండా రాజుకు జాతీయ స్థాయి ఐకాన్ అవార్డు గౌతమి బంగారు నంది పురస్కారం-2024 అవార్డును హైదరాబాద్‌లో ఆదివారం అందుకున్నారు. వ్యవసాయం, ఆధ్యాత్మిక రంగంలో గుండా రాజు చేస్తున్న కృషిని వారు గుర్తించి ఈ అవార్డు అందజేశారు. ప్రముఖ కవి మాడుగుల భాస్కరశర్మ, చీమల కోటేశ్వరి చేతుల మీదుగా గుండా రాజు అవార్డును హైదరాబాద్ లో త్యాగరాయ గాన సభ సమావేశ మందిరంలో అందుకున్నారు. అవార్డు మరింత బాధ్యత పెంచిందని, గుండా రాజు పేర్కొన్నారు. ఈ అవార్డు ప్రకటించినందుకు నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గుండా రాజుకు అవార్డు రావడం పట్ల మంథని వాసులు, కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

నియామకం

పెద్దపల్లి రూరల్, జూలై 29: గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెద్దకల్వల గ్రామానికి చెందిన సలేంద్ర రాములు యాదవ్‌ను రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్ నియమించారు. ఈసందర్భంగా సోమవారం హైదరబాద్‌లోని గొర్రెలకాపరుల సంక్షేమ సంఘం కార్యాలయంలో నియామక పత్రాన్ని అందించారు. వారి వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, అఖిల భారత యాదవ మహసభ జిల్లా యూత్ అధ్యక్షులు ఆట్ల సాగర్ యాదవ్, పర్స సమ్మయ్య యాదవ్, చంద్రమొగిలి యాదవ్, మహేందర్ యాదవ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బొంకూరి మధుకు అవార్డు

కోల్‌సిటీటౌన్, జూలై 29: గోదావరిఖనికి చెందిన ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, పాత్రికేయుడు బొంకూరి మధు నల్లవజ్రం జాతీయ పురస్కార్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు తార ఆర్ట్స్ అకాడమీ జాతీయస్థాయి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సంకె రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును ఆగస్టు 10, 11వ తేదీలలో గోదావరిఖనిలో జరుగనున్న కార్యక్రమంలో మధు కు అందజేయనున్నారు.

సౌకర్యాల కల్పనకు చర్యలు

పాలకుర్తి, జూలై 29: బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీ సీఓఓ అభయ్ దాదిచ్‌తో సోమవారం పర్మినెంటు కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేష్ యాదవ్‌లు ఇచ్చిన డిమాండ్ చాట్‌పై కార్మికుల సమక్షంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ అధికారులతో జరిపిన చర్చలు సఫలీకృతం అయ్యాయని అన్నారు. వారం రోజుల్లో పూర్తి స్థాయిలో అగ్రిమెంటు చేయడానికి ఒప్పందం కుదిరిందన్నారు. తక్షణమే వర్కర్స్ క్లబ్‌లో సౌకర్యాలు మెరుగు పరచడం కొరకు గత అగ్రిమెంట్లో సాంక్షన్ చేసిన 70 వేలతో పాటు అదనంగా మూడు లక్షల రూపాయలు, అజంతా మహిళ మండలి సభ్యుల కోసం 2 లక్షల రూపాయలు తక్షణమే ఇవ్వాలని కోరినట్లు వారు తెలిపారు. ఈ చర్చల్లో ప్లాంట్ హెడ్ శ్రీనివాసరెడ్డి, ఏవీపి హెచ్‌ఆర్ మేనేజర్ పి.పార్థసారథి,యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్షవేణి శ్రీనివాస్, క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతుల ప్రసాద్, ఏదునూరి నారాయణ, తప్పట్ల మోహన్, దేవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

కోల్‌సిటీటౌన్, జూలై 29: ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించింది గోదావరిఖనికి చెందిన శతాధిక వృద్ధురాలు. గాంధీనగర్‌కు చెందిన బండారు నర్సమ్మ(102) అనే శతాధిక వృద్ధురాలు ఆదివారం మృతిచెందగా ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం చేశారు. సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్య దర్శి కెఎస్ వాసు, పట్టణ ప్రధాన కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ టెక్నిషియన్ సతీష్ నర్సమ్మ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం ఎల్వీప్రసాద్ ఐ బ్యాంక్ ద్వారా అభినందన పత్రాన్ని నర్సమ్మ కుమారుడు, సింగరేణి కార్మికుడు బండారి రాజలింగయ్య, కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా నర్సమ్మ కుటుంబసభ్యులను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.

'నంది' నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ధర్మారం, జూలై 29: ధర్మారం మండలం నందిమేడారంలో గల నంది పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం నుంచి గోదావరి జలాల ఎత్తిపోతలను ప్రారంభించారు. సోమవారం నుంచి ఐదు పంప్ మోటార్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌లోకి నీటిని తరలిస్తున్నారు.



అండర్‌మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

- జీడీకే-2 ఇంక్లయిన్‌లో విధులు బహిష్కరించిన కార్మికులు - గని ఆవరణలో ఆందోళన

గోదావరిఖని, జూలై 29: సింగరేణి ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 2ఇంక్లైన్‌లో ఈ నెల 27న జరిగిన గని ప్రమాదానికి అండర్ మేనేజరే కారణమంటూ, అతనిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఉదయం షిఫ్టులో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహించారు. పని స్థలం ప్రతికూలంగా ఉందని, అయినా కూడా పనులు చేయాలని బలవంతం చేయడం తో కార్మికులు అక్కడ పని చేస్తుండగా అకస్మాత్తుపై పైకప్పు కూలిందని కార్మికులు ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన అండర్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ సింగరేణిలో రక్షణ చర్యలు విస్మరించడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని, కార్మికుల ప్రాణాలు కోల్పోయిన తరువాత వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, ఇది న్యాయం కాదన్నారు. యాజమాన్యం కార్మికుల ప్రాణాలకు వెలకట్టడం సరికాదని, ప్రమాదం జరుగుతుం దని ముందే హెచ్చరించినప్పటికీ యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ రక్షణ చర్యలపై లేవని వారు ఆరోపించారు. ప్రమాదానికి బాధ్యుడైన అండర్ మేనేజర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు గని ఆవరణలో ఆందోళనకు దిగడంతో ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అక్కడికి చేరుకుని కార్మికులను శాంతింపచేశారు. ప్రమాదంపై విచారణ జరుగుతుందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడంతో ధర్నా విరమించి కార్మికులు విధులకు హాజరయ్యారు. ఈ నిరసనలో టీబీజీకేఎస్ నాయకులు పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, ఏఐటీయూసీ నాయకులు రామస్వామి, రంగు శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు మెండె శ్రీనివాస్ పాల్గొన్నారు.



గని ఆవరణలో ఆందోళన చేస్తున్న కార్మికులు

ఎంవీటీసీలో మొక్కలను నాటిన ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 29: సింగరేణి సీఎండీ బలరాం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకని సోమవారం ఆర్జీ-2 ఎంవీటీసీ శిక్షణా కేంద్రంలో ఉద్యోగులు మొక్కలను నాటారు. గిరిజన ఉద్యోగుల సంఘం ఆర్జీ-2 ఏరియా ప్రధాన కార్యదర్శి తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో మొక్కలు నాటి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో అంప్టీ ఇంచార్జి హుస్సేన్, ఎంవీటీసీ ఇంచార్జి మేనేజర్ ము రళీకృష్ణ, ఇన్‌స్ట్రక్టర్లు నాగెల్లి సాంబయ్య, మహేష్, సతీష్, వెంగలి సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 29: సింగరేణి పరిరక్షణ పేరిట సీఐటీయూ తలపెట్టిన బస్‌యాత్ర పోస్టర్‌ను సోమవారం ఓసీపీ-3 సీహెచ్‌పీలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా యూనియన్ ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ ఎస్ వెంకన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భూమయ్య, రవి, కిషోర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రామగిరి, జూలై 29: తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని ప్రధాన అంశంపై సోమవారం నుంచి ఆగస్టు 5 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే బస్సు యాత్రను పోస్టర్ ఆవిష్కరించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఎరవేల్లి ముత్యంరావు హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు దొమ్మటి కొంరయ్య, ఎద్దుకుమార్, హమోద్‌పాషా, వేణుగోపాల్, తిరుపతి, రమణారెడ్డి, శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.